**దట్టమైన కనుబొమలు, అంతే దట్టమైన బుగ్గ మీసాలు, పరిశీలనగా చూసే కళ్ళు, ఫుల్ మిలిటరీ యూనిఫాం, దర్జాగా... ఆ ఫొటో ఎవరిదో కాదు పదేళ్ళ కిందటి నా రూపానిదే. అది వసారాలో పైన గోడకు తగిలించి వుంటుంది. నేను దానికెదురుగా పిట్ట గోడకానుకుని వడక్కుర్చీలో కూర్చుని వుంటాను. అయితే నాకూ, దానికీ ఓ తేడా!**

నా గతాన్ని చక్కగా నెమరేసుకునేందుకు ఎన్నో సాయంత్రాలు దూరాన్న బొమ్మల్లా పరుగెత్తే రైళ్ళన్నీ వాటి వెనకగా తళుక్కుమని మెరిసిపోయే పడమటి సూరీణ్ణి తీరిగ్గా చూసుకునేందుకూ అవకాశమిచ్చింది ఆ తేడాయే!

మా అమ్మాయి చాలా సార్లనేమాట డాడీ మీకింత వయసొచ్చినా ఆ ఠీవి తగ్గలేదని. మా అబ్బాయేమంటాడంటే. అబ్బే ఏమీ అనడు. అంత తీరికా లేదు వాడికి. నిత్యం ఏవో వూళ్ళు తిరిగేరకం కంపెనీ పనుల మీద. ఇకపోతే వంటవాడు ఉహూ వంటవాడేమిటి? ఆత్మబంధువు లాంటివాడు. "బాబూ మీకా కాలేగనక ఉంటే పదిమంది కాలేజీ కుర్రాళ్ళయినా మీ ముందు తీసికట్టు" అంటాడు బాధపడుతూ. "రాములూ ఇప్పుడయినా మించింది లేదురా!" మీసాలు మెలేస్తూ లేచి నిలబడే వాడిని. ఆ సరికే రాములు నా కాసరాగా వచ్చేసేవాడు. ప్చ్ ప్చ్- ఏడీ ఆ రాములు. రాములూ-నా కేక నా గొంతు దాటి వచ్చిందా! ఏమో....హూఁ రాములు లేడు. రాడు-ఖచ్చితంగా రాడు.

అమ్మాయ్ సాయంత్రమయింది. దీపాలేస్తావా? దీపాలు వెలిగాక మా అమ్మాయి ముఖం చూడాలి. ఎంతందంగా ఉంటుందో అంత నిర్మలంగా ఉంటుంది. ముఖ్యంగా ఆ కళ్ళు.... !

అమ్మాయి దీపాలేసినట్టు లేదేం? అవునవును ఇక్కడెలా వేస్తుంది. ఢిల్లీలోని కరోల్ బాగ్‌లోని కొత్తగా కొనుక్కున్న వాళ్ళ యింట్లో వేసి వుంటుంది. ఆ సరికే వాళ్ళాయన వచ్చివుంటాడు. పిల్లలు మమ్మీడాడీల కేరింతల్లో వుంటారు. ఈ సమయాల్లో మరి తను జ్ఞాపకం ఉండేదెక్కడ? వాళ్ళ ప్రపంచం వాళ్ళది. వాళ్ళనుభూతులు వాళ్ళవి.

లక్ష్మీ— అది ఎదురింట్లో వాళ్ళమ్మాయి నుద్దేశించిన పిలుపు. ఆ అమ్మాయి సాయం సూర్యుడస్తమించేదాకా డాబామీద ఒక్కర్తే చదువుకుంటుంది. తర్వాత తనలా ప్రకృతి పరిశీలనలో మునిగిపోతుంది. లక్ష్మీ-ఈసారి ఆ అమ్మాయి గబగబా దిగిపోతుంది.

లక్ష్మీ- ఏదీ తన లక్ష్మి! లక్ష్మి తనన్యాయం చేసిందా లేక తనే అన్యాయం చేశాడా? పెళ్ళినాడు అగ్నిసాక్షిగా భర్త సుఖ దుఃఖాల్లో కలిమిలేముల్లో సమభాగినిగా ఏవేవో అనుకున్నవన్నీ ఏమయినయ్. హూ వదిలి వెళ్ళిపోయింది. జ్ఞాపకాల వల విసిరేసి వెళ్ళిపోయింది. భగవాన్! ఈ విషయంలో నిన్ను క్షమించలేనోయ్. నోనో క్షమించను ఊఁ!


అవునూ లక్ష్మి పోవడానికెవరు కారణమనీ! తనే—నిజంగా తనే. అసలే గుండె నీరసపు మనిషి. తనకిందచేయలేకచచ్చిందా! ఆ అలానే అనుకోవాలి మరి. రోజూ ఎన్ని సాయంత్రాలు తనని డాబాపై కెక్కించ గలదు. ఆ కుంటి కులాసంతో కబుర్లాడుతూ కూర్చోగలదు. పాపం మెట్లమీదనుంచి జారి పడిపోయింది. అప్పుడా శబ్దానికి నాన్నా అంటూ పరుగున వచ్చేడు కొడుకు. అబ్బ అప్పుడు వాడు తనని చూసిన చూపు మర్చిపోలేడు. పడిపోయిన వ్యక్తి అమ్మ అయినందుకు ఎంత బాధపడ్డాడీ పిచ్చివెధవ. అవునవును ఓసారి అలాగే ఎవరో స్నేహితులతో అన్నట్టున్నాడు. మరీ పిచ్చికాకపోతే రోజూ ఏం చూసేది డాబామీద నెక్కి మా ప్రాణాలు తీయడానికి!

అబ్బ ఆ మాట గుండెల్లో తూటాలా! నిజానికి ఆ మాటంది వాడేనా? ఆ వాడే! తన గుండెలమీద ఆడుకున్న వాడే!

ధడ్ ధడా....ధడ్ ధడా కోరమాండల్ శబ్దం! ఎక్కడా ఆగదు. ఇక్కడస్సలాగదు. దేన్నీ కేర్ చెయ్యదు తనలాగానే. అందుకే అదంటే తనకిష్టం. ఓ గౌరవం కూడాను. అవునూ శివరామారావేడీ కోరమాండల్‌కు ముందే వస్తాడే. ఏమిటో ఆయనో రకం- ఏరకమంటే—లాగి ఒక్కటివ్వాలనిపించే రకం. కానీ శివరామారావు రావాలని కోరుకునే రకం తను. భలే కబుర్లు చెప్తాడు. ఓ రెండు గంటలు సునాయాసంగా గడచిపోతాయి. అన్నట్టు చూశారూ.. ఎన్నిసార్లు దొర్లిస్తాడోగాని ఎంతచెప్పినా విసుగెయ్యదేం తనకి. అలవాటో ఏమో కోరమాండల్లా అదీ అలవాటయినట్టుంది.

ఏమిటింకా రాలేదీయన. ఒకవేళ అలిగాడేమో తనమీద. అయినా ఈ వయసులో అదేంపని. సివిలుద్యోగిగా రిటైర్ కాబోతున్నాడు మళ్ళీ. అతనికో విధవ చెల్లెలుంది. ముసలితల్లీను. మూడోపెళ్ళి చేసుకున్నాడు- రెండుసార్లూ భార్యలుగతించాక. ఏమయ్యా శివం అంటే అతని జవాబు— "అన్నట్టు చూశారూ జీవితం నాలుగు దశల్దీ. మరి నాల్గోదశలో కొచ్చానా. సరిగ్గా ఈ దశలోనే ఓ ఆడదాని తోడుండి తీరాలి. అయితే మా వెధవ చెల్లెలుంది. ఏం లాభం-దాని తల్లి చాకిరీకే దాని జీవితం సరిపోతుందాయె. మరి నన్నెవరు చూసుకుంటారూ? ఏ కొడుకూ చూడడు. ఏ అల్లుడూ రానివ్వడు. అన్నట్టింకోటి చూశారూ"

పాపం ఆమెను చూస్తే జాలేస్తుంది. పట్టుమని ముప్పయి కూడా ఉండవు. ఏమిటో





# ఆసరా

వారణాసి ప్రసాదరావు

ఏం జీవితాలో. వాళ్ళ కన్న వాళ్ళు మెగొంతు కోసేరులా వుంది. ఆ విషయమే ఓ వారం కిందట చర్చల్లో కాస్త తీవ్రంగా వచ్చింది. అందుకు శివం గంటుపెట్టుకున్నాడులా వుంది సరిగ్గా రావడంలేదు.

ప్చ్..లక్ష్మి! లక్ష్మిపోయాక రాములు! తన జీవితంలో ఏదో వెల్తి స్పష్టంగా కనిపిస్తోంది. నిత్యం ఎవరికోసమో అన్నట్టు చూడాల్సి వస్తోంది. నిజానికి తనకెవరూ లేరా తనెవరికీ లేడా? ఉంటే వాళ్ళు రారా? ఎందుకురారూ వస్తారు. వస్తారు. పక్కింటి అమ్మాయి బొద్దుగా ముద్దుగా ఎన్నికబుర్లు చెప్పేదీ. అలా సన్నజాజు లేరుకుంటూ ఎన్నికబుర్లు చెప్పేదో! ఆ పాపకి తన కబుర్లంటే యిష్టం కాబోలు. ఆయుద్ధం సంగతులు అడిగి అడిగి కుతూహలంగా వినేది. ఆ కబుర్లలో కాలానికి విలువేదీ? ఏమిటే ఆయన్తో కాలక్షేపం నీకు బాగా కుదుర్తోంది. వాళ్ళమ్మ సణుగుడు వినలేక క్రమంగా మానుకొంది. వాళ్ళు వెళ్ళిపోయారు. రేపా అమ్మాయికి పెళ్ళ

సులభముగా ఇంగ్లీషు మాట్లాడుటకు




బాలాజీస్ ఈసీ వే టు స్పీక్ ఇంగ్లీష్

బడిలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంగ్లీషు చదివికూడా వ్యాకరణ సంశయము గలవారికి. వ్యాకరణ దోషములు లేకుండా సరళముగా ఇంగ్లీషు మాట్లాడుటకు, వ్రాయుటకు, నేర్పించుటకు ఉపకరించే పుస్తకం!
ఉద్యోగులు, వ్యాపారస్థులు, ఇంగ్లీషులో ఎక్కువ పరిజ్ఞానము లేనివారికి తెలుగుద్వారానే వ్యాకరణబద్ధంగా ఇంగ్లీషు నేర్చుకొనుటకు ఇది ఒక మంచి సాధనము!
ఈ పుస్తకం చదవడం ప్రారంభించగానే మీతోబాటుగా ఒక ఉపాధ్యాయుడు తోడున్నట్లే భావించగలరు!

మీ ఊరిలోని అన్ని బుక్‌షాపుల లోను లభిస్తుంది. వెల. రూ. 19-50

వివరములకు:
బాలాజీ పబ్లికేషన్స్
103 పైక్రాఫ్ట్స్‌రోడ్, మద్రాసు-600 014.

BALAJI PUBLICATIONS
103 PYCROFTS ROAD
MADRAS 600 014


య్యాక వాళ్ళాయన్తో తనకబుర్లన్నీ చక్కగా చెప్తుందా. ఏమో? ఆ అమ్మాయే అనేది. అంకుల్ మీరిలా ఒక్కరే ఇక్కడే కాలక్షేపం చేసే కంటే మీ అబ్బాయి వద్దకో అమ్మాయివద్దకో వెళ్ళవుండచ్చుగా.

నిజమే.ఉండొచ్చుబాగా ఉండొచ్చు.కానీ ఉంచుకునే వారేరీ. తనేం పిచ్చివాడా వాళ్ళ మొహాల్లో కనబడేవి చూసి కూడా ఉండటానికి. పైగా అంటారు-నాన్నా. మాతోబాటు నువ్వెన్ని ఊళ్ళని తిరగ్గలవు యిబ్బంది పడుతూ. అక్కడే వుంటే ఎవరన్నా వండి వార్చెయ్యకపోరు. తలాకొంత పంపుతాం గదా.

ఏడ్చారు-పంపుతాం వండి వార్పించుకోమంటారు. నా పెన్షన్ నా పొట్టకు చాలదా ఏం. సరే ఎవరి ఆనందాలు వారివి తనెవడు పుడకలా మధ్య ! అన్నట్టు తనకీమధ్య ఓ ఆలోచన వచ్చింది. ఎందుకో తెలీదు. ఓ సారి తటుక్కున వచ్చేసింది. అబ్బ దాని లోనే సైమంతా హరించుకుపోతోంది. శివరామారావు సంఘటన తర్వాత తనకా ఆలోచనతో కాలక్షేపం కుదిరిపోతున్నా బుర్ర మాత్రం వేడెక్కిపోతోంది. రాములు పోయాడు. రెండు కాళ్ళుండీ పోయాడు. పాడు వర్షంలో తెగిపోయిన కరంటు తీగ మీద కుడికాలేసి పోయాడు. తనలా ఒక్క ఎడంకాలేగనక ఉంటేబతికిపోయేవాడేమో. వాడు పోవడంకాదు. కుటుంబాన్ని అవిటి చేసేసి పోయాడు. చేసేది గవర్నమెంటుద్యోగం కాదు. జూట్ గోడవును నైట్ వాచరు వుద్యోగం. పదేళ్ళలోపు పిల్లలిద్దరు. భార్య. తను వాళ్ళనెలా ఆదుకోగలడని? నా అన్న వాళ్ళు లేనివాళ్ళకి తను కొంత ఆసరా కల్గించాడు. రాములు స్థానే శాంత వంటకు కుదిరింది. తను తిని పిల్లలకు కొంత తీసుకుపోతుంది. ఎన్నాళ్ళని. ఇది తన ప్రశ్నకాదు. శాంత వేసినదే. అదేమిటీ నీ కెక్కడయినా పని దొరికిందా అనడిగితే. లేదు బాబూ మీ కొండిపెట్టే దానికి ముగ్గురు తినడం నాకు న్యాయమనిపించలేదు.

ఎక్కడయినా పాచిపనులు చేసుకుంటా.

వద్దు వద్దు శాంతా. గబగబా అనేసి ఊరుకున్నా అప్పటికి.

నిజానికి శాంతను పోషించడం కష్టమా తనకు?ఏముందీ. పెన్షను వస్తోంది. ఇల్లంతా తనకెందుకూ. ఓ పోర్షను అద్దెకిస్తే-ఆ అవునవును అద్దెకిద్దాం.బ్రహ్మాండంగాపోషించవచ్చు. మిగల్చనూ వచ్చు.

అదేసంగతి చెప్పాక శాంత ఏమీ అనలేదు, ఒద్దుబాబూ అన్నమాట తప్ప. సరిగ్గా అదిగో ఆ శివరామారావు సంఘటనతర్వాతే అన్నాను, శాంతా మీలో మారు మనువులున్నాయా? అని. ఆ ప్రశ్నకు ఆమె ఏమన్నదీ, ఎలా స్పదించిందో గాని నిలువెల్లా వణికిపోవడం మాత్రం గుర్తుంది. తర్వాత అదే— ఆ మర్నాడు. ఛి ఛీమనుషులా పశువులా పీక్కుందరూ. ఏదో గుసగుసలు చెప్పుకుంటున్నారేం! ఖచ్చితంగా మనుషులేమరి.

సరిగ్గా ఓ వారంరోజులు శాంత రాలేదు. ఆఖరికి స్వయంగా వాళ్ళగుడిసెలకు వెళ్ళాక చావు బతుకుల్లో వున్న పిల్లల్ని చూడాల్సి వచ్చింది. ఎలాగోలా ఒప్పించి పిల్లలిద్దరికీ వైద్యం చేయించాక. వాళ్ళు మృత్యువు లోంచి బయటకు వచ్చాకగానీ శాంత ఈ లోకంలోకి రాలేకపోయింది. అప్పుడడిగాను. మొదటి ప్రశ్నని.

జవాబుగా తల కదిల్చింది. "సరే విను. ఇన్నాళ్ళు ఏ ఆదరణా ఏ ఆసరా లేక కష్టైలా బ్రతుకుతున్నా. నీకుతెలుసుగదా నా బిడ్డల సంగతి. నిజానికి బ్రతకాలంటే ఎలాగోలా బ్రతికేయగలను. కానీ రాములు పోయాక నీకోఆసరా ఇవ్వాలనినిశ్చయించుకున్నాను. ఇది నా స్వార్థం అనుకుంటావేమో. అనుకున్నా అదీ నిజమే. ఇక పోతే ఈ లోకం గురించి ఇంకేం ఆలోచించకు. నీవు వస్తూంటే తిండిపెట్టని లోకం నీ పిల్లలు చావు బతుకుల్లో వుంటే పట్టించుకోని లోకం గురించి చూడవద్దు. ఇక నా పిల్లలగురించా అదినా ఇష్టమే" చెప్పేశాను. దృఢంగా చెప్పేశాను. నిజంగా అంతే.

అబ్బ ఏమిటీ కాంతి! లైటు వెలిగిందా! ఎవరదీ శాంతా.

శాంత వచ్చినట్లుంది. భోజనం సిద్ధంగా వుంది భోంచెయ్యండి.అంటుందేమో? లేవబోయాను.

శాంత గబుక్కున క్రిందకి వంగింది. ఊతకర్ర అందిద్దామనా! లేదే. అయ్యో నా పాదాలు స్పృశించి నమస్కరిస్తోంది. భయంగా వినయంగా ఆ ఒక్క పాదాన్నే.

అంతే. నిటారుగా నిలబడ్డాను. ఠీవిగా దర్జాగా!! ఇప్పుడు నా ఫొటోకూ. నాకూ తేడా లేదు.

